క్లుప్తంగా

పీడీఎస్‌యూతో ప్రగతిశీల ఉద్యమాలు

బూర్గంపాడు: విద్యారంగంలో అసమానతలు తొలగించి అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించాలని ప్రగతిశీల ఉద్యమాలకు పీడీఎస్‌యూ పునాది వేసిందని మాజీ పీడీఎస్‌యూ నాయకులు సానికొమ్ము బ్రహ్మరెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ 50 వసంతాల సందర్భంగా ప్రచార పోస్టర్లను గురువారం సారపాకలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ పోరాటాల ఫలితంగానే విద్యారంగంలో కొంత మేరా మార్పులు వచ్చాయన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంశీ, మాధురి, జోష్న, అఖిల తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భద్రాచలంఅర్బన్: మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువతకు దూరంగా ఉండాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని కూనవరం రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల దుష్ప్రభావాలను వివరించారు. వాటి వినియోగం, రవాణాపై చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో నిర్లక్ష్యం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను, ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు అన్నారు. గురువారం సాంబాయిగూడెం గ్రామపంచాయితీలో సిపిఎం పార్టీ గ్రామసభ నిర్వహించారు. తొలుత మండల కార్యదర్శి రాములు పార్టీ జెండాను ఆవిష్కరించి దివంగత బుద్ధదేవ భట్టాచారి, సీతారాం ఏచూరి, కుంజా కృష్ణకుమారిలకు రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రాములు మాట్లాడారు. నాయకులు సత్రపల్లి సాంబశివరావు, దామల్ల లెనిన్‌బాబు, రాజు, సత్తెమ్మ, నరసమ్మ, సోమిరెడ్డి, సంజయ్‌రెడ్డి, బాబురావు, టేకుల సత్యావతి పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహికంగా సీమంతాలు చేశారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇమ్మడి పద్మావతి మాట్లాడుతూ.. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మొబైల్ టీం డాక్టర్ షామిలి, సిబ్బంది భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు సుందరి, సావిత్రి, రాధ, రాణి, వెంకమ్మ, వెంకాయమ్మ, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు జమ చేయాలి

గుండాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని, కొత్త రుణాలు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు బచ్చల సారన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నప్పటికీ రైతు భరోసా రైతుల ఖాతాలో వేయకపోవడంతో రైతులకు పెట్టుబడికి డబ్బులు లేక ప్రైవేట్ వ్యాపారస్తులని ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొమరం సీతారాములు, గడ్డం లాలయ్య, ఈసం మంగన్న, పాయం ఎల్లన్న, కల్తీ మల్లన్న, వాగబోయిన సుందర్రావు, పర్షిక పొట్టయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన లలితకుమారి, వారి కుమారుడు అఖిల్ రాథోడ్‌లు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాతను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు దోసపాటి నాగేశ్వర రావు, సీహెచ్ బాలకేశ వరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

భద్రాచలంలో హైడ్రా తరహా కూల్చివేతలు

- నెల రోజుల క్రితమే ఖాళీ చేయాలని ఆదేశాలు
- బాధితులంతా సాధారణ వృత్తిదారులే..
- రానున్న రోజుల్లో పెరగనున్న కూల్చివేతలు


జేసీబీతో దుకాణాలను కూల్చివేస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు పర్వం కొనసాగుతోంది. హైదరాబాద్ తరహాలో భద్రాచలంలో కూడా అధికారులు కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు. భద్రాచలంలోని ఓ స్థలంలో కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాన్ని సంబంధించి కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ఈ తరుణంలో సదరు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను ఖాళీ చేయాల్సిందిగా భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు నెల రోజుల క్రితమే ఆదేశించారు. అయినప్పటికీ సదరు దుకాణాల నిర్వాహకులు అధికారుల మాటలను ఖాతరు చేయకపోవడంతో గురువారం ఉదయం 5:30 గంటల సమయంలో పోలీసుల ఆధ్వర్యంలో దుఖాణాలను నెలమట్టం చేశారు. ఈ కూల్చివేతల్లో సుమారు 14 దుకాణాలు నెలమట్టం కాగా, అధికారులు తీసుకున్న చర్యల పట్ల సదరు దుకాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడే పెయింటింగ్, ఎలక్ట్రీషీన్ పనులు చేసుకుంటూ తమ జీవితాన్ని వెల్లదీస్తున్నామని, ఇప్పుడు మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని సదరు దుకాణదారుల నిర్వాహకులు వాపోతున్నారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. నెల రోజుల క్రితమే ఈ దుకాణాల నిర్వాహకులను ఖాళీ చేయాలని ఆదేశించామని, ఇందులో భాగంగానే ఈ కూల్చివేతలు జరిగాయని తెలిపారు.

అక్రమార్కుల గుండెల్లో గుబులు..

ఇదిలా ఉండగా భద్రాచలంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ప్లాట్‌ఫామ్‌లు కబ్జాకు గురయ్యాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి దుకాణాలను ఏర్పాటు చేసిన పలువురికి ఇప్పటికే ఆ స్థలాలను ఖాళీ చేయాల్సిందిగా గ్రామ పంచాయతీ అధికారులు ఆదేశించారు. దీంతో భద్రాచలంలో పట్టణంలో అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వివిధ రూపాల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి.

శాఖల సమన్వయం తప్పనిసరి..

ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైన విషయాలకు సంబంధించి పట్టణంలోని పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ వెళ్తే.. పట్టణంలో ఎక్కడెక్కడ ఏ స్థలం కబ్జాకు గురైంది అనే విషయంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా గురువారం భద్రాచలం పట్టణంలో అక్రమ దుకాణాల కూల్చివేతల సమయంలో కేవలం గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ అధికారులు మాత్రమే కనిపించారు. రానున్న రోజుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే కబ్జాకి గురైన అన్ని ప్రభుత్వ స్థలాలను కాపాడే అవకాశం ఉంది.

మహ్మద్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం..


మహ్మద్‌నగర్ రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ: దాదాపు 20 గంటలపాటు ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. చంద్రుగొండ మండలంలోని తిప్పనపల్లి పంచాయతీ మహ్మద్‌నగర్ గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. గ్రామస్తులు ఒక్కొక్కరితో మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. మహ్మద్‌నగర్ గ్రామాన్ని తాను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఏడాదికాలంలో దీన్ని సమస్య లేని గ్రామంగా తీర్చుదిద్దుతానన్నారు. మౌలిక సదుపాయాల కల్పనపై అంకితభావంతో పనిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

కాగా, రచ్చబండ సభలో గ్రామస్తులు విద్యుత్, అంతర్గత రోడ్లు, తాగునీరు వంటి పలు సమస్యలను ప్రజలు ఏకరువు పెట్టారు. ప్రతీ సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ బి.అశోక్, వివిధ శాఖల ఏఈలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యా నాయక్, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు. టీ సురేష్, ఫజల్‌బక్ష్, సంకా శంకర్, దారావత్ రామారావు, యండి.అన్వర్, ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.

అవినీతిని సహించేది లేదు


మహాజన సభలో మాట్లాడుతున్న తుక్కాని మధుసూదన్‌రెడ్డి

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక సహకార సంఘంలో అధికారులు, సిబ్బంది అవినీతి చేస్తే సహించేది లేదని సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నెల్లిపాక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.రాజు హాజరయ్యారు. సభలో 2023–24 జమా ఖర్చులకు, ఆడిట్ రిపోర్ట్‌ను, 2024–25 జమ ఖర్చులకు ఆమోదం తెలిపారు. సంఘం పరిధిలో మల్లెలమడుగులో ఉన్న గోదాంను రూ.35,54,969 అంచనాలతో ఫంక్షన్‌హాల్‌గా మార్చడానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తుక్కాని మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత, ప్రస్తుత పాలకవర్గంలో అవినీతి ఆరోపణలున్న అధికారులకు ఎవరూ సహకరించొద్దని సూచించారు. సభలో సంఘం డైరెక్టర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలతో ఆరోగ్యం


ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న డాక్టర్ రామకృష్ణ, సంస్థ బాధ్యుల రమ్య, సౌజన్య


భద్రాచలంఅర్బన్: స్వచ్ఛతా హీ సేవాలో కార్యక్రమంలో భాగంగా గురువారం ఐటీసీ వావ్ సంస్థ (ఈశ్రీ–ఫౌండేషన్) ఆధ్వర్యంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ పాల్గొని, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం, స్వచ్ఛమైన శ్వాస కోసం మొక్కలు పెంచాలని సూచించారు. ఐటీసీ వావ్ సంస్థ కోఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి, పంచాయతీ సూపర్‌వైజర్లు సంధ్య, జగదీష్, నిఖిలేష్, ఎం.మనోహర్, రమేష్, నాగేంద్ర, మనోహర్, సీఆర్పీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలను అభివృద్ధి చేస్తాం


గోశాలను సందర్శించిన లయన్స్‌క్లబ్ బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలోని గోశాలను గురువారం అశ్వారావుపేట లయన్స్‌క్లబ్ బాధ్యులు సందర్శించారు. ముందుగా గోశాలను పరిశీలించి సమస్యలు గురించి తెలుసుకున్నారు. అనంతరం క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ.. గోవుల సంరక్షణ కోసం అవసరమైన షెడ్ల నిర్మాణాలను చేస్తామని, గోశాల చుట్టు రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీ అవరణలో గడ్డి విత్తనాలను నాటి గ్రాసం పెంచుతామని తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దూపకుంట దుర్గారావు, కోశాధికారి చలపతి, యూఎస్ ప్రకాశ్‌రావు, సీతారామస్వామి, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి


మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లు

బూర్గంపాడు: ఆశ వర్కర్లను నోటికి వచ్చినట్లు దూషిస్తు వేధిస్తున్న మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యాధికారి, హెచ్‌ఈఓ, వైద్యసిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆశవర్కర్లు గురువారం విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ.. ఆశవర్కర్ల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై విచారణ చేసి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు జోక్యం చేసుకుని ఆశవర్కర్లను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు బుచ్చమ్మ, తారాదేవి, కృష్ణవేణి, శ్రీలత, విజయ, నాగేశ్వరి, నాగమణి, సంపత్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా గురువారం మాస కల్యాణం నిర్వహించారు. పలు రకాల పూజలు, కార్యక్రమాల అనంతరం ఉత్సవ విగ్రహాలకు కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, అర్చకులు భార్గవాచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వైద్య పరీక్షలు

కరకగూడెం: స్థానిక పీహెచ్ సీలో 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల సిబ్బందికి కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి ఎంపీడీఓ కుమార్, హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పేరు మార్పు సరికాదు

అన్నపురెడ్డిపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు సరికాదని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు మారుస్తూ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, దోసపాటి రాంబాబు, గోళ్ల పుల్లారావు, వనమా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి అధ్యక్షతన మెంటర్ ఇంటూరి భాస్కరరావు విద్యార్థులకు మోటివేషన్ (ఇంపాక్ట్) ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వరరాజు, మల్లికార్జున, రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్ రావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

కరకగూడెం: మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కరకగూడెం జెడ్పీ పాఠశాల పీజీ హెచ్‌ఎం గడ్డం మంజులాను గురువారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మలకం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి పోలబోయిన మోహన్ రావు, కొమరం అశోక్ కుమార్, జిమ్మ వెంకటేశ్వర్లు, మైపతి తిరుమల రావు,మహిళా సభ్యురాలు ఏడుళ్ళ తిరుపతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజికంగా ఎదగాలి

చంద్రుగొండ: గొత్తికోయ ఆదివాసీలు సామాజికంగా ఎదగాలని ఎస్ఐ గంజి స్వప్న కోరారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టల ప్రాంతంలోని ఆదివాసీల ప్రాంతమైన ఎర్రబోడును గురువారం ఆమె సందర్శించారు. ప్రతి ఇంటినీ పరిశీలించి వారితో మాట్లాడారు. కుటుంబనియంత్రణ పాటించాలని, పిల్లలను చదివించాలని ఎస్ఐ గొత్తికోయలకు సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్ల కోటి, రాంలాల్, సురేష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బొర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు


మణుగూరురూరల్: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

గుండాల: ఏజెన్సీ గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటున్న నిషేధిత మావోయిస్టులకు సహకరిస్తే ఎలాంటి వారికైనా శిక్ష తప్పదని గుండాల సీఐ రవీందర్ హెచ్చరించారు. గురువారం మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మండలంలోని దామెర తోగు గ్రామాన్ని పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎవరైన అనుమానితులుగా కొత్త వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అదేవిధంగా వారోత్సవాల నేపథ్యంలో గుండాల దామరతోగు మధ్య కల్వర్టులను చెక్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్ సిబ్బంది మంగయ్య, వెంకటేశ్వర్లు, స్పెషల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరురూరల్: అనుమానస్పదంగా కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన ఎస్టీ కాలనీని ఆయన సిబ్బందితో కలిసి సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. నిషేధిత మావోయిస్టులకు సహాయ సహాకారాలు అందించవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రంజిత్, పోలీస్, టిజిఎస్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి టీచర్లకు శిక్షణ

గుండాల: స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (ఎస్‌టీఈపీ) వారి సారథ్యంలో ఉచితంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు అక్టోబర్ 4 , 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్ షేక్ మహమూద్ పాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులు సందర్భంగా ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామం రమణారావు సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా ఈ తరగతులకు హాజరు కావచ్చని తెలిపారు. తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతితో పాటు ధృవీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

రక్షణపై మత్స్యశాఖ అవగాహన


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గోదావరి వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో రక్షణ కోసం తెప్పపై అవగాహన సదస్సు గురువారం ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం మండలంలోని అచ్యుతాపురం గ్రామం గంగోలు చెరువు వద్ద భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలలోని మత్స్య సంఘాల అధ్యక్షులు, సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్‌కుమార్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ రామకృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారులు కోటేశ్వరరావు, భార్గవ్ సాయి కుమార్, మంగరాజు, ఆర్‌ఐలు వెంకటేశ్వరరావు, నరసింహారావు, సంఘ అధ్యక్షుడు అర్జునరావు, శ్రీనివాస్, ప్రభాకర్, రమేష్, దామోదర్ మత్స్యకారులు పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌పై శిక్షణ


చర్ల: ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


దమ్మపేట: యాప్‌పై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

చర్ల: దివ్యాంగ విద్యార్థులను స్క్రీనింగ్ ద్వారా గుర్తించి అనుకూలమైన రీతిలో విద్యా బోధన చేసేందుకు గానూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశస్త్ యాప్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో రెండు రోజుల పాటు కొనసాగిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి యాప్‌పై ప్రతీ ఉపాధ్యాయుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ బాబూరావు, ఆర్‌పీ సీహెచ్ హిమగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


దమ్మపేట: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను స్క్రీనింగ్ ద్వారా గుర్తించి వారికి అవసరమైన విద్య బోధాన చేసేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ప్రశస్థ యాప్ నిర్వహణపై మండలంలోని ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో ఎంఈఓ కేసరి లక్ష్మి అధ్యక్షతన ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు మండల ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: పట్టణంలోని కొర్రాజుల గుట్ట హైస్కూల్‌లో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రశస్త్ యాప్‌పై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో దివ్యాంగులతో పాటు ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పద్మావతి, సుమలత, సీఆర్‌పీ గోపి, రామకృష్ణ, బేబి కుమారి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి..

చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలను, ప్రజాస్వామిక పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు, రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్


మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు


అన్నపురెడ్డిపల్లి: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


ములకలపల్లి: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహాలక్ష్మి


కరకగూడెం: ఐలమ్మ చిత్రపటం వద్ద తహసీల్దార్, ఉద్యోగులు